

ఇదేందిరొయ్యో..!

పెదకరగ్రహారంలో వైసీపీ నేత భూ ఆక్రమణ

అధికారంలో ఉన్నా.. లేకున్నా.. తమదే రాజ్యమన్నట్టు ఇష్టాను సారంగా అక్రమాలకు పాల్పడుతున్నారు వైసీపీ నాయకులు. మచిలీపట్నం నార్త్ మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రొయ్యల చెరువులుగా తవ్వేస్తుండటమే ఇందుకు నిదర్శనం. పెదకరగ్రహారం నుంచి గిలకలదిండికి వెళ్లే డొంకరోడ్డు వెంబడి వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసిన వైసీపీ నాయకు డొకరు మూడు, నాలుగు రోజులుగా ఆ భూమిని రొయ్యల చెరువులుగా తవ్వేస్తున్నాడు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టిం చుకోకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి.

పెదకరగ్రహారంలో ప్రభుత్వ భూముల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు



25 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్ను

- మూడు రోజులుగా రొయ్యల చెరువుల తవ్వకాలు
- ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదించిన భూమి
- వైసీపీ హయాంలోనే 100 ఎకరాల ఆక్రమణ
- స్థానికులు అడ్డుకోవడంతో అప్పుడు వెనకడుగు
- తాజాగా కూటమి నేతల సాయంతో మళ్లీ అక్రమాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పెద కరగ్రహారం, గిలకలదిండి ప్రాంతాల్లో రెండు మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. పెదకరగ్రహారం గ్రామంలో రాష్ట్ర గోడౌన్లకు అత్యంత సమీపంలోని 200 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకోసం ఇప్పటికే భూ సర్వేచేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు. ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. పెదకరగ్రహారం గ్రామంలో రీసర్వే నెంబరు 248లో మొత్తం 534 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇందులో 100 ఎకరాలపై వైసీపీ హయాంలో వైసీపీ నాయకుడొకరు కన్నేసి రొయ్యల చెరువులుగా తవ్వించే పనులు ప్రారంభించాడు. ఈ భూ ఆక్రమణపై అప్పట్లో ఆరోప ణలు రావడంతో అధికారులు స్పందించి రొయ్యల చెరువుల తవ్వకాలను నిలిపివేశారు. నాటి నుంచి మిన్నకుండిపోయిన ఆ వైసీపీ నాయకుడు.. ప్రస్తుతం స్థానిక కూటమి నాయకులు కొందరిని తన దారిలోకి తెచ్చుకుని గ్రామం పక్కనే ఉన్న 25 ఎకరాలను రొయ్యల చెరువులుగా తవ్వే పనులు ప్రారంభించాడు. ఈ చెరువులను మిగతా 8లో..

మడ అడవులను నరికేసి..

పెదకరగ్రహారం-గిలకలదిండి డొంకరోడ్డు పొడవునా మడ అడవులు ఉన్నాయి. సముద్రపు ఆటుపోటు సమయంలో మడ అడవుల్లోకి ఉప్పునీరు వచ్చిపోతూ ఉంటుంది. ఈ భూమిని ఆక్రమించేందుకు ముందస్తు వ్యూహంలో భాగంగా మడచెట్లను నరికేసి, చిన్నపాటి చెరువులుగా గతంలోనే మార్చేశారు. కొద్దిరోజులు వేచిచూసి ఈ చిన్నపాటి చెరువుల చుట్టూ ఎక్స్‌కవేటర్ పెట్టి పెద్దగట్లు వేసి పెద్ద చెరువులుగా తవ్వేస్తున్నారు.

అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అక్రమాలు

గిలకలదిండి, పెదకరగ్రహారం గ్రామాల్లో మత్స్య కారులు సముద్రంలో వేటాడే చేపలు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు మత్స్య సంపద రవాణా, ఇతరత్రా చిన్నపాటి పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర ఇప్పటికే ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణంలో భాగంగా గిలకలదిండి-కరగ్రహారం డొంక రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు కూడా తయారుచేశారు. ఈ డొంకరోడ్డును కరగ్రహారం గ్రామంవైపు నుంచి కొంతమేర అభివృద్ధి చేసి కంకర రోడ్డుగా మార్చారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు సమకూ రుతున్న సమయంలో వైసీపీ నాయకుడు ఏకంగా 25 ఎకరాల ప్రభుత్వ భూమిని రొయ్యల చెరువులుగా తవ్విస్తుండటం ఆశ్చర్యం కలిగించే విషయం. కొందరు కూటమి నాయకులు వైసీపీ నాయకుడికి అండగా ఉండగా, మరికొందరు ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.

విద్యుద్దీపకాంతులతో మెరిసిపోతున్న ఇంద్రకీలాద్రి



జై భవానీ

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు

- ఉదయం 8 గంటలకు హోమగుండాలు ప్రారంభం
- పక్కాగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- ఐదు రోజుల ఉత్సవాలకు 7 లక్షల మంది వస్తారని అంచనా
- ఉచిత అన్నప్రసాద వితరణకు విస్తృత ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్ర కీలాద్రిపై భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి. గత ఏడాది ఉత్సవాలకు 4 లక్షల మంది భక్తులు రాగా, ఈసారి 7 లక్షల మంది వరకు వస్తారని అంచనా. గురువారం ఉదయం 6.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 8 గంటలకు హోమగుండాలను ప్రారం భిస్తారు. 15వ తేదీ ఉదయం పూర్ణాహుతితో ముగుస్తాయి.

పకడ్బందీ ఏర్పాట్లు

భవానీ భక్తుల కోసం 'భవానీ దీక్ష 2025' మొబైల్ అప్లికే షన్‌ను సిద్ధం చేశారు. దర్శన సమయాలు, ప్రసాదం కౌంటర్లు, మార్గాలపై ఇది ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తుంది. ప్రత్యేక క్యూలు, విశ్రాంతి మందిరాలు, ప్రసాదం కౌంటర్లు, అన్నదానం కేంద్రాలు, అప్‌గ్రేడ్ భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఆల యం, క్యూలు, స్నానఘాట్లు, గిరిప్రదక్షిణ ప్రాంతాల్లో సుమారు 3వేల మందికి పైగా పోలీసు సిబ్బంది మోహరిస్తున్నారు. 300 సీసీ టీవీ కెమెరాలను సిద్ధం చేశారు. అన్ని మిగతా 8లో..

భవానీ దీక్షల చీఫ్ ఫెస్టివల్ అధికారిగా మూర్తి

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణలకు చీఫ్ ఫెస్టివల్ అధికారిగా ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో ఎన్వీఎస్ ఎన్ మూర్తిని నియమిస్తూ బుధవారం దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత రాజమండ్రి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ (ఆర్జేసీ) త్రినాథ్‌ను నియమించారు. అయితే, అన్నవరం దేవస్థానం ఈవో పదవీ విర మణ చెందడంతో త్రినాథ్‌ను ఇన్‌చార్జి ఈవోగా నియమించారు. దీంతో భవానీ దీక్షల విరమణలకు చీఫ్ ఫెస్టివల్ అధికారిగా మూర్తిని నియమించారు.

స్క్రబ్ టైఫస్‌తో మహిళ మృతి

బందరు సర్వజనాసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



ఆసుపత్రిలో మృతిచెందిన మణి

మచిలీపట్నం టౌన్/కృత్తివెన్ను, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్‌తో మచిలీ పట్నం జిల్లా ప్రభుత్వా సుపత్రిలో ఓ మహిళ మృతిచెందింది. కృత్తి వెన్ను మండలం అడ్డ పర్ర గ్రామానికి చెందిన గోడ మణి (55) ఈనెల 6న స్క్రబ్ టైఫస్ బారిన పడి ఆసుపత్రిలో చేరింది. చికిత్స పొందుతూ బుధవారం ఆమె మరణించింది. కాగా, ఆసుప త్రిలో వైద్యం సరిగ్గా అందలేదంటూ బంధువులు కొద్దిసేపు ఆందోళన చేశారు. అనంతరం మణి భౌతికకాయాన్ని అడ్డపర్రకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఆశాలత మాట్లా డుతూ ఆసుపత్రిలో చేరకమునుపే మణి పూర్తిగా అస్వస్థతగా గుర్తైందన్నారు. కొన్నిరోజులుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పితో మిగతా 8లో..

అయ్యయ్యో.. చంద్రయ్య

రూ.కోటి.. రూ.2 కోట్లు కాదు.. ఏకంగా రూ.22.13 కోట్ల టెండర్ అది. ప్రకటన వెలువడగానే ఆ ముగ్గురు ప్రజాప్రతినిధులకు ఆశ పుట్టుకొచ్చింది. ఆ టెండర్ పై వారి కన్ను పడింది. ఇంకేముంది.. అది తమకే దక్కాలని పట్టుబట్టుకుని కూర్చున్నారు. ఇదీ కృష్ణాజిల్లాలోని చంద్రయ్య డ్రెయిన్ టెండర్ వండర్.

చంద్రయ్య డ్రెయిన్ మరమ్మతులపై ఆ ముగ్గురు ఎమ్మెల్యేల కన్ను

- కాంట్రాక్టు తమకు కావాలంటే తమకు కావాలంటూ పట్టు
- రూ.22.13 కోట్ల టెండర్‌పై ఎడతెగని పంచాయితీ
- తలలు పట్టుకుంటున్న జలవనరుల శాఖ అధికారులు
- చేసేదేమీ లేక టెండర్ గడువు పెంపు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కృష్ణాజిల్లాలోని పెనమలూరు, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల్లో చంద్రయ్య డ్రెయిన్ ప్రవ హిస్తోంది. గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, పామర్రు నియోజకవర్గంలో పెదపారుపూడి, పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరు మండలాలను ఇది తాకుతుంది. దీనికి మరమ్మతులు చేసి, చుట్టూ సిమెంట్ పనులు చేయడానికి జలవనరుల శాఖ 'ఈ' టెండర్లను ఆన్‌లైన్‌లో ఆహ్వానించింది. ఈ డ్రెయిన్ మరమ్మతులకు రూ.22.13 కోట్లకు అంచనాలను రూపొందించింది. ఇందులోనే డ్రెయిన్ చుట్టూ చేయాల్సిన సిమెంట్ పనులకు రూ.1.90 కోట్లను కేటాయించింది. ఈ టెండర్ దాఖలుకు బుధవారంతో గడువు ముగిసింది.

పంచాయితీతో పెరిగిన గడువు

చంద్రయ్య మేజర్ డ్రెయిన్ టెండర్ల ప్రక్రియలో స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్లు మాత్రమే బిడ్ దాఖలు చేయాలి. మిగతా 8లో..

చంద్రయ్య డ్రెయిన్



వాటాల్లో తేడాలు

చంద్రయ్య మేజర్ డ్రెయిన్ టెండర్ల కోసం ముగ్గురు ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నప్పటికీ వారికి అనుకూలంగా వ్యవహరించేందుకు జలవనరుల శాఖ అధికారులు ఒక నిర్ణయం తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ..వారికే టెండర్లను కట్టబెడితే అధికారులకు భారీగానే కమీషన్లు అందుతాయి. అయితే, కమీషన్ల వ్యవహా రంలో తేడాలు రావడం, ఎటూ తెగకపోవడంతో టెండర్ల దాఖలుకు గడువును పొడిగించారన్న వాదన ఇతర కాంట్రాక్టర్ల నుంచి వినిపిస్తోంది.

ఎట్టకేలకు బయటకు..!

ఇన్నాళ్లకు బయటకొచ్చిన వైసీపీ నేత కొడాలి నాని

- గుడివాడలో పరాజయం అనంతరం అజ్ఞాతంలో..
- వైసీపీ సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీమంత్రి
- అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటున్న కూటమి కార్యకర్తలు



గుడివాడలో జరిగిన సంతకాల సేకరణలో కొడాలి

మచిలీపట్నం/గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సార్వ త్రిక ఎన్నికల్లో ఓటమిపాలై ఇంతకాలంగా బయటకు రాని మాజీమంత్రి కొడాలి నాని ఎట్టకేలకు జనంలో కనిపించారు. అనారోగ్య కారణాలు చూపి ఇన్నాళ్లూ.. ఇంటి నుంచి బయటకు రాని ఆయన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో బయటపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌పై బూతులు మాట్లాడిన కొడాలి నాని బూతుల మంత్రిగా రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఓట్ల లెక్కింపు రోజున మొదటి రౌండ్‌లోనే తన ఓటమి ఖాయమని తెలుసుకుని కౌంటింగ్ స్టేషన్ నుంచి బయ టకు వచ్చిన ఆయన ఇంతకాలంగా బయటకు రాకుండా మిగతా 8లో..



భళా బాలోత్సవ్

8

అమరావతి బాలోత్సవం కమిటీ నిర్వహిస్తున్న 8వ పిల్లల పండుగ రెండోరోజు బుధవారం కూడా ఉత్సాహంగా సాగింది. విజయవాడలోని పీబీ సిద్ధార్థ ప్రాంగణం చిన్నారులతో కళకళలాడింది.



టెట్ ప్రారంభం

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. కానూరులోని ఓ పరీక్షా కేంద్రానికి హడావిడిగా వెళ్తూ, హాల్ టికెట్ నెంబర్లను సరిచూసుకుంటున్న అభ్యర్థులు

పాత పాటే..!

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65 విస్తరణ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటికే ప్రతిపాదించిన డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను ప్రజాప్రతినిధులు వ్యతిరేకించినా.. దానినే ఎన్‌హెచ్ అధికారులు ఢిల్లీకి పంపేందుకు చూడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్‌హెచ్-65 విస్తరణపై మళ్లీ ప్రతిష్టంభన

- ప్రజాప్రతినిధులు తిరస్కరించిన డీపీఆర్‌నే కేంద్రానికి పంపే ఏర్పాట్లు
- బెంజిసర్కిల్-పెనమలూరు ఫ్లై ఓవర్‌కు ఎంపీ, ఎమ్మెల్యేల ప్రతిపాదన
- డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను ప్రతిపాదించిన ఏపీఎంఆర్‌సీ అధికారులు
- విస్తరణకు రూ.2,600 కోట్లు ఇస్తామని ప్రకటించిన కేంద్రమంత్రి గడ్కరీ
- రూ.930 కోట్లతోనే డీపీఆర్ ప్రతిపాదించిన కన్సల్టెన్సీ సంస్థ
- నిధులుండగా.. మీనమేషాలు లెక్కిస్తున్న ఎన్‌హెచ్ అధికారులు
- కనీసం ఆరు వరసలకు అయినా విస్తరించాలనే డిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణలో బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు జరిగే పనుల్లో సందిగ్ధం నెలకొంది. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ అనేది డీపీఆర్‌లో లేదు. కానూరు వరకు కేవలం డ్రెయిన్లతో కూడిన నాలుగు వరసల రహదారే ఉంటుంది. మిగతా 8లో..

రూ.930 కోట్లతో డీపీఆర్.. మర్మమేమిటి?

విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 విస్తరణ డీపీఆర్‌ను రూ.930 కోట్లతో రూపొందించారు. కేంద్ర ప్రభుత్వానికి నిధులు ఆదా చే సేలా ఈ డీపీఆర్ రూపకల్పన చేశారే తప్ప క్షేత్రస్థాయి అంశాలను పరిగణన లోకి తీసుకోలేదు. బడ్జెట్ తగిన విధంగా ఉన్నా కానూరు నుంచి బెంజిసర్కిల్ వరకు ఎందుకు 6 వరసలుగా విస్తరిం చటానికి ఎందుకు ప్రతిపాదించలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.



ప్రేమ తీసిన ప్రాణం

- హైదరాబాద్‌లో పెనుగంచిప్రోలు యువకుడి హత్య
- చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన సాయి
- బంధువుల సాయంతో హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్య
- చిన్న వయస్సులోనే ప్రేమ
- యువతి కుటుంబ సభ్యుల చేతిలో దారుణ హత్య



శ్రావణ్ సాయి (ఫైల్)

పెనుగంచిప్రోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన వెంటనే తల్లి చనిపో యింది.. ప్రేమగా పెంచిన నాన్న కూడా మరణించాడు.. కన్నవారి ప్రేమకు దూరమైన ఆ కుర్రాడు ప్రేమించిన అమ్మాయితోనైనా జీవితాన్ని ఆనందంగా గడపాల నుకున్నాడు. మిగతా 8లో..

ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రత్యేక చర్యలు

- విజయవాడ రైల్వే డివిజన్‌లో ఆర్పీఎఫ్ తనిఖీలు

8

ఫ్లై ఓవర్ నిర్మాణానికి 4.50 ఎకరాల సేకరణ

- మంగినపూడి బీచ్ వద్ద నిర్మాణంపై అధికారుల అంచనాలు

8

నకిలీ పోలీసు అరెస్టు

- మహిళను మభ్యపెట్టి.. బంగారం కాజేసి..



సంతకం చేస్తున్న మాజీ మంత్రి కొడాలి నాని

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

- 6 నెలల తర్వాత ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటా
- మాజీ మంత్రి కొడాలి నాని

గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు (నాని) ఆరోపించారు. నియోజకవర్గంలో సేకరించిన కోటి సంతకాల ప్రతులను పార్టీకి పంపే కార్యక్రమాన్ని గుడివాడ మండలం లింగవరంలోని కే-కన్వెన్షన్‌లో బుధవారం నిర్వహించారు. కోటి సంతకాల ప్రతుల వ్యాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు బైపాస్ సర్జరీ జరిగిందని, వైద్యుల సలహా మేరకు 6 నెలలు విశ్రాంతి తీసుకున్నానని, ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని, మరో 6 నెలల తరువాత ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటానన్నారు. ఈ నెల 17న కోటి సంతకాల ప్రతులను వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందజేస్తామన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేసే విషయంలో పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి 4.50 ఎకరాల భూ సేకరణ

మచిలీపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్ రహదారికి ఇరువైపులా ఉన్న పోతేపల్లి, గోపువానిపాలెం, తపసిపూడి గ్రామాల పరిధిలోని 4.50 ఎకరాల భూమిని ఫ్లై ఓవర్ నిర్మాణానికి సేకరించాల్సి ఉందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. భూసేకరణలో భాగంగా ఎన్ని గృహాలు తొలగించాలి, రహదారి పక్కనే ఉన్న ఆలయాలు ఎన్ని ఉన్నాయి, సర్వీస్ రోడ్లు ఎక్కడ నుంచి ఎక్కడివరకు నిర్మాణం చేస్తారనే అంశాలపై అధికారులు అంచనా వేశారు.

రాకపోకలకు అంతరాయం లేకుండా..

మచిలీపట్నం పోర్టు నిర్మాణంలో భాగంగా పోతేపల్లి నుంచి పోర్టు వరకు రైల్‌కం రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే భూసేకరణ పూర్తిచేశారు. పోర్టు వరకు నిర్మాణం చేస్తే మంగినపూడి రహదారి వెంబడి ఉన్న గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడతాయి. దీంతో పోర్టుకు వచ్చే వాహనాలు, గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరుగుతాయి. ఈ నేపథ్యంలో పోర్టు రోడ్డు-మంగినపూడి బీచ్ రోడ్డు క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రణాళికను రూపొందించారు. రోడ్‌కం రైలు మార్గం నిర్మాణంతో పాటే ఈ ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా భూసేకరణకు అధికారులు సర్వే చేశారు.

నకిలీ పోలీసు అరెస్టు

- మహిళను మభ్యపెట్టి బంగారం కాజేసిన వైనం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సీసీఎస్ పోలీసునని చెప్పి మచిలీపట్నంలోని ఒక మహిళను మభ్యపెట్టి 90 గ్రాముల బంగారం కాజేసిన నిందితుడిని బుధవారం చిలకలపూడి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. చిలకలపూడి సీఐ నబీ అందించిన వివరాలిలా ఉన్నాయి. నరసరావుపేటకు చెందిన మేకల సాయికుమార్ అనే నిందితుడు మచిలీపట్నంలోని ఒక మహిళను మభ్యపెట్టి 90 గ్రాముల బంగారం తీసుకున్నాడు. ఆ మహిళ చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం పోలీసులు గాలించగా నిందితుడు సాయికుమార్ నరసరావుపేటకు చెందినవాడని తేలింది. ఇలా గుంటూరు, రాజమండ్రి, ఏలూరులో మహిళలను బ్లాక్‌మెయిల్ చేసి బంగారం, నగదును తీసుకున్నట్టు కేసులున్నాయి. ఈ నేపథ్యంలో నిందితుడు సాయికుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

క్రిస్మస్‌కు ప్రత్యేక రైళ్లు


రైల్వేస్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని క్లియర్ చేసేందుకు ఈనెల 24 నుంచి 30 వరకు చర్లపల్లి - కాకినాడ టౌన్ మధ్య ఈనెల 28 నుంచి 31 వరకు కాకినాడ - చర్లపల్లి మధ్య ఓ ప్రత్యేక రైలు నడవనుంది. 07196 చర్లపల్లి - కాకినాడ టౌన్ బుధ, మంగళవారాల్లో రాత్రి 7.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరుతుంది. మరునాడు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. 07195 కాకినాడ టౌన్ - చర్లపల్లి ఆది, గురువారాల్లో రాత్రి 7.50 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరుతుంది. మరునాడు ఉదయం 8.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకువీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. ఫస్ట్ ఏసీ కమ్ సెకండ్ ఏసీ, ఏసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని డివిజన్ పీఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్ కాదు లోకల్ సమ్మిట్: కేఏ పాల్

గాంధీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి 4 కోట్ల తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ విమర్శించారు. తెలంగాణలో జరిగింది గ్లోబల్ సమ్మిట్ కాదని, లోకల్ సమ్మిట్ అని ఎద్దేవా చేశారు. గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. సమ్మిట్‌ల పేరుతో అవినీతి జరిగిందని ఆరోపించారు. అంతర్జాతీయంగా ఏ దేశానికి సంబంధించిన వ్యాపార దిగ్గజాలు సమ్మిట్‌కు రాలేదని, వీరికి బదులు వరల్డ్ బిగ్గెస్ట్ క్రిమినల్ టోని బ్లెయర్‌ను ముఖ్య అతిథిగా పిలిచారన్నారు. సినీ నటుడు చిరంజీవికి సమ్మిట్‌కు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఫేక్ ఎంవోయూలతో రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎయిర్‌పోర్టులను అదానీకి అప్పగించేందుకు కేంద్రం విమానాలను నిలుపుదల చేసిందన్నారు.

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఇలక్కియా



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 11 నుంచి 15 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్ (జేసీ) ఇలక్కియా అన్నారు. బుధవారం ఆమె దుర్గగుడి ఈవో శీనానాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కావూరి చైతన్య, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఇంజనీరింగ్ అధికారులు చేపట్టిన పనుల వివరాలుఅడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి రాంబాబు, పలువురు రెవెన్యూ అధికారులు, దుర్గగుడి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరికే ఉత్సాహం..!

కళ్ల నిండా ఆత్మవిశ్వాసం! చేతుల నిండా నైపుణ్యం..!

- పల్లె పాటలు, జానపదాల గుభాళింపు
- చిత్రలేఖనంలో పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- ఎన్నో అంశాల్లో చర్చల్లో పాల్గొన్న చిన్నారులు
- బాలోత్సవం రెండో రోజున విద్యార్థుల సందడి









మొగల్రాజపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిట్టి చిట్టి చిన్నారులు.. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు వచ్చిన విద్యారులు.. ఒకరు కాదు ఇద్దరు కాదు.. వందలాది మంది తమలో ఉన్న ప్రతిభను పది మంది ముందు ప్రదర్శించాలనే ఉత్సాహం.. పోటీపడాలనేతత్వంతో పీబీ సిద్ధార్థ ప్రాంగణాన్ని హోరెత్తిస్తున్నారు. అమరావతి బాలోత్సం కమిటీ నిర్వహిస్తున్న 8వ పిల్లల పండగ రెండో రోజు కూడా ఉత్సహంగా జరిగింది. తెలుగువారికి మాత్రమే సొంతమైన కోలాటంలో విద్యార్థుల గ్రూపులు పోటీలు పడ్డారు. శాస్త్రీయ నృత్యాలతో కళామతల్లిని మించి అన్నట్టుగా అలరించారు. తెలుగు నుడికారంలో యాసలను జోడించి పల్లెపాటలు జానపద గీతాలను ఆలపించారు. నరనరాన దేశభక్తిని రగిలించే పాటలతో ఆడిటోరియంను మోత మోగించారు. కంప్యూటర్ కాలంలో చేతితో వేసే చిత్రలేఖనం మాయమవుతున్న రోజుల్లో చిత్రలేఖనంలో విద్యార్థులు చేయి తిరిగిన చిత్రకారులను మరిపించేలా పెన్సిల్, కుంచె చేత పట్టి చిత్రాలను గీశారు. తెలుగు డిక్టేషన్, బెస్ట్ ఫ్రం వేస్ట్, షార్ట్ ఫిల్మ్ విశ్లేషణ, డిబేట్, పద్యం భావం పోటీల్లో చిన్నారులు, విద్యార్థులు పోటీ పడ్డారు.

మొత్తానికి బాలోత్సవం పిల్లల్లో నిఘూడంగా ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికగా మారింది. ఎటు చూసిన రంగు రంగుల దుస్తులతో కేరింతలతో తిరుగుతున్న విద్యార్థులతో పీబీ సిద్ధార్థ ప్రాంగణం పూలతోటలా మారింది.

సాంస్కృతిక ప్రదర్శనలు అవసరం

పిల్లల్లో మానసిక వికాసం కోసం సాంస్కృతిక ప్రదర్శనలు అవసరమని వారిలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సంస్కృతి సంప్రదాయాల గురించి తెలుసుకుంటారని ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు అన్నారు. అమరావతి బాలోత్సవం 8వ పిల్లల పండగ 2వ రోజు విజేతల బహుమతి ప్రదానం బుధవారం సాయంత్రం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని దాన్ని బహిర్గతపరచడానికి బాలోత్సవం వంటి వేదికలు అసరాగా నిలుస్తున్నాయన్నారు. బాలోత్సవం అధ్యక్షులు రామరాజు మాట్లాడుతూ ఒక్కో ఏడాది ఒక్కోథీమ్‌తో నిర్వహిస్తున్న బాలోత్సవం ఈ ఏడాది పర్యావరణాన్ని రక్షిద్దాం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 40 అంశాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో 5వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా తొలిరోజు పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, ఎంబీవీకే కార్యక్రమాల ఇన్‌చార్జి పిన్నమనేని మురళీకృష్ణ, సభ్యులు ఉయ్యూరు సాంబిరెడ్డి, యూవీ రామరాజు, యార్లగడ్డ సుబ్బారావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కోలాటంలో దుమ్ము రేపిన విద్యార్థులు



తనిఖీల్లో ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులను

ప్రయాణికుల భద్రతకు చర్యలు

- విజయవాడ డివిజన్‌లో ఆర్‌పీఎఫ్ తనిఖీలు


రైల్వేస్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్‌లో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆర్పీఎఫ్ విభాగం ఈనెల 8, 9 తేదీల్లో వివిధ స్టేషన్‌లలో నిర్వహించిన సోదాలలో నేరాలను గుర్తించి నిందితులను పట్టుకున్నారు. విజయవాడ పీఆర్వో ప్రకటించిన మేరకు.. నేరగాళ్ల చర్యలను అరికట్టేందుకు డివిజన్‌లో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈనెల 9న ఒంగోలు, నెల్లూరు బృందం, బచ్‌పన్ బచావ్ ఆందోళన్ రాష్ట్ర సమన్వయకర్తల తనిఖీలలో బీహార్, ఒడిసాల నుంచి కార్మికులుగా తమిళనాడుకు పిల్లలను తరలిస్తున్న వైనాన్ని గమనించారు. పిల్లలను గుర్తించి నేరస్తులను పట్టుకున్నారు. తునిలో ఆపరేషన్ యాత్రి సురక్షా పేరిట ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి టీమ్ ట్రైన్ నెంబరు 17243లో తనిఖీలు నిర్వహించారు. చోరీకి గురైన రూ.54వేల విలువ గల సొత్తును, కొంత నగదును, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నన్హేఫరిష్తా కింద ఈనెల 8న ఆర్‌పిఎఫ్ పోలీసులు విజయవాడ 6వ నెంబరు ప్లాట్‌ఫారంపైన ఇంటి నుంచి పారిపోయి వచ్చిన 13 సంవత్సరాల బాలుడిని గుర్తించారు. 1098 చైల్డ్ హెల్ప్ డెస్క్ ద్వారా తాత్కాలిక షెల్టర్, కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. ఆపరేషన్ అమానత్ కింద ఒంగోలు, అనకాపల్లిలలో ఆర్‌పిఎఫ్ సిబ్బంది తనిఖీలు చేసి రైల్వే బోగీలలో మర్చిపోయిన సుమారు రూ.38వేల విలువ గల వస్తువులను గుర్తించి వాటి యజమానులకు అప్పగించారు.

అందుబాటులో 30లక్షలకు పైగా లడ్డూలు..

ఇంద్రకీలాద్రి: భవానీ దీక్షల విరమణను పురస్కరించుకుని సుమారు 30 లక్షలకు పైగా లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంచినట్టు ఈవో శీనానాయక్ తెలిపారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి లడ్డూ పోటు భవనంలో ప్రసాదం తయారీని పరిశీలించారు. లడ్డూ ప్రసాదం నాణ్యత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 8 లక్షల లడ్డూలు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు వివరించారు. లడ్డూ తయారీలో నాణ్యత లోపించకుండా భక్తులకు సకాలంలో అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, ఏఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

16 నుంచి 20 వరకు ఉర్దూ మహోత్సవాలు: మంత్రి ఫరూక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ షుబ్లీ



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన ఏకైక సీఎం చంద్రబాబు నాయుడని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. బుధవారం వన్‌టౌన్ పంజా సెంటర్‌లోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో ఉర్దూ అకాడమీ ఉద్యోగుల సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి ఫరూక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషకు మతంతో సంబంధం లేదన్నారు. ఉర్దూ అకాడమీ చరిత్రలో సీఎం ఆధ్వర్యంలో ఉర్దూ భాషాభివృద్ధికి నూతన అధ్యాయం లిఖిస్తామన్నారు. ఉర్దూ అకాడమీ ఉద్యోగుల్లో పనిచేసేవారికి గుర్తింపు, పనిచేయని వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎండీ ఫరూక్ షుబ్లీ మాట్లాడుతూ ఉద్యోగులు, సభ్యులందరూ శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. సురూర్ ఎ ఉర్దూ వారోత్సవాలు పేరుతో ఈనెల 16 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు బ్రోచర్‌ను సీఎం చంద్రబాబు విడుదల చేస్తారన్నారు. రానున్న 90 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అకాడమీ లైబ్రరీ సెంటర్లు, కంప్యూటర్ సెంటర్లను పరిశీలించనున్నట్టు తెలిపారు. 159 మంది ఉద్యోగులలో 14 మంది సమావేశానికి గైర్హాజరయ్యారని, వారికి తక్షణమే మెమో జారీ చేయాలని అకాడమీ సెక్రటరీ షుబ్లీ ఆదేశించారు. ఉర్దూ అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జై భవానీ

(7వ పేజీ తరువాయి)

ఆర్జిత సేవలను నిలిపివేశారు. హోమగుండాలు, అన్నప్రసాద వితరణ, కేశఖండన శాల వద్ద ఏర్పాట్లు పక్కాగా చేశారు. 950 మంది క్షురకులు కేశఖండనశాలలో సేవ చేస్తారు. ఈసారి అదనంగా దోబీ ఘాట్ వద్ద కూడా స్నానాలకు ఏర్పాట్లు చేశారు. చెప్పుల స్టాండ్లు, క్లోక్‌రూమ్‌లు తగినన్ని సిద్ధంగా ఉంచారు. దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బంది పడకుండా వెయ్యిమంది వలంటీర్లను నియమించారు. 9 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ మార్గంలో పోలీసు బందోబస్తుతో పాటు భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోనున్నారు. తాగునీరు, పాలు, బిస్కెట్లు పంచనున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచారు.

పార్కింగ్ ప్రాంతాలివే..

ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే భవానీలు, భక్తుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. భవానీపురం పున్నమి ఘాట్, కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీ స్థలం, సత్యనారాయణపురంలోని బీఆర్టీఎస్ రోడ్డు పార్కింగ్ ప్రదేశాలుగా ఏర్పాటు చేశారు.

ప్రేమ తీసిన ప్రాణం

(7వ పేజీ తరువాయి)

చిన్నవయస్సులోనే ప్రేమలో పడి.. చివరికి ఆ ప్రేమ కోసమే ప్రాణాలు వదిలేశాడు. హైదరాబాద్‌లో ప్రేమించిన అమ్మాయి కుటుంబ సభ్యుల చేతిలో హత్యకు గురైన పెనుగంచిప్రోలుకు చెందిన కాకాని శ్రావణ్‌సాయి (20) కథ విషాదంగానే ముగిసింది. వివరాల్లోకి వెళితే.. శ్రావణ్ సాయి చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. దీంతో నానమ్మ ఇంటి వద్ద పెరిగాడు. బంధువుల సాయంతో హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో సాయి తనతో పాటు చదువుతున్న అమ్మాయిని ప్రేమించాడు. ఆమె తల్లిదండ్రులకు వీరి వివాహం ఇష్టం లేకపోవడంతో ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు శ్రావణ సాయిని మంగళవారం దారుణంగా హత్య చేశారు. పోస్టుమార్టం అనంతరం అతని భౌతికాయాన్ని పెనుగంచిప్రోలుకు తీసుకొస్తున్నట్లు బంధువులు తెలిపారు. శ్రావణ సాయికి తల్లిదండ్రులు లేకపోయినా.. మంచిగా చదువుకుని ఉన్నతస్థానంలో చూడాలన్న సత్సంకల్పంతో బంధువులే అతడిని చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయి దారుణహత్యకు గురికావడంపై వారు కన్నీటిపర్యంతమవుతున్నారు.

స్క్రబ్ టైఫస్‌తో మహిళ మృతి

(7వ పేజీ తరువాయి)

బాధపడుతున్న మణి ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం పొందిందని, ఎంతకీ తగ్గకపోవటంతో ఈనెల 6న మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారని శీతనపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సాయి సందీప్ తెలిపారు. వైద్యులు ఆమెను పరీక్షించి, స్క్రబ్ టైఫస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారని, అలాగే, వైరల్ మైనింగో ఎన్సెఫలిటిస్ వ్యాధిని కూడా గుర్తించారని పేర్కొన్నారు. కాగా, మృతురాలి ఇంటిని వైద్యాధికారులు, సిబ్బంది సందర్శించి, పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

ఇదేందిరొయ్యో..!

(7వ పేజీ తరువాయి)

విజయవాడకు చెందిన వారికి లీజుకిచ్చే ప్రయత్నం చేస్తున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పెదకరగ్రహారంలో ప్రభుత్వ భూముల్లో రొయ్యల చెరువులు తవ్వే ప్రాంతాన్ని పరిశీలిస్తాం. రెవెన్యూ సిబ్బందితో పాటు పోలీసులను సంఘటనాస్థలానికి పంపి చట్టపరంగా చర్యలు చేపడతాం.

\- నాగభూషణం, తహసీల్దార్, మచిలీపట్నం నార్త్ మండలం

అయ్యయ్యో.. చంద్రయ్య

(7వ పేజీ తరువాయి)

ఆ కాంట్రాక్టర్లు బిడ్‌ను వేద్దామనుకునే సరికి కృష్ణాజిల్లాకు చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. చంద్రయ్య మేజర్ డ్రెయిన్ టెండర్లలో కాంట్రాక్టర్లు ఎవరూ బిడ్లు వేయడం కుదరదని హుకుం జారీచేశారు. అంతటితో ఆగకుండా అధికారులకు అనధికారికంగా ఆదేశాలిచ్చారు. ఈ డ్రెయిన్ పెనమలూరు నియోజకవర్గంలో మూడు కిలోమీటర్లు, పామర్రు నియోజకవర్గంలో 12 కిలోమీటర్లు, గుడివాడ నియోజకవర్గంలో 25 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. దీనిప్రకారం జలవనరుల శాఖ టెండర్లను ఆహ్వానించింది. ఒక యువ ఎమ్మెల్యే మాత్రం చంద్రయ్య డ్రెయిన్ టెండర్ మొత్తం తనకే కావాలని పట్టుబడుతున్నారు. దీంతో మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా తమ పరిధిలోనూ చంద్రయ్య డ్రెయిన్ ప్రవహిస్తుంది కాబట్టి తాము టెండర్లు దాఖలు చేస్తామని కూర్చున్నారు. దీంతో జలవనరుల శాఖ అధికారులు.. ఏం చేయాలో తెలియని మీమాంసలో పడ్డారు. బుధవారంతో ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలుకు గడువు ముగిసినప్పటికీ ఈ నెల 17 వరకు పొడిగించారు.

పాత పాటే..!

(7వ పేజీ తరువాయి)

కానూరు-దావులూరు వరకు నాలుగు వరసల రహదారితో పాటు రెండువైపులా సర్వీసు రోడ్లు ఉంటాయి. దావులూరు-మచిలీపట్నం వరకు ఆరు వరసల విస్తరణకు ప్రతిపాదించారు.

ప్రజాప్రతినిధులు వ్యతిరేకించినా..

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్)ను దృష్టిలో ఉంచుకుని విజయవాడ నగరం, శివారు ప్రాంతాల విస్తరణను ఎన్‌హెచ్ అధికారులు గాలికొదిలేశారు. ఎప్పుడో వచ్చే ఓఆర్‌ఆర్ కోసం ఇప్పుడు నిర్లక్ష్యం చేయటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్ని అనుమతులు వచ్చి, టెండర్లు పూర్తి చేసుకుని, పనులు మొదలు పెట్టి, పూర్తి కావాలంటేనే పదేళ్లు పడుతుంది. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్-65 విస్తరణను ఎన్‌హెచ్ అధికారులు సందిగ్ధంలో పడేశారు. డీపీఆర్‌ను ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వర్ల కుమార్‌రాజా వ్యతిరేకించారు. అయినా ఆ డీపీఆర్‌నే ప్రతిపాదించటం వెనుక కారణమేమై ఉంటుందనే విషయం సందేహంగా మారింది. దీనిపై ఎన్‌హెచ్ అధికారుల వాదన విచిత్రంగా ఉంది. ప్రజాప్రతినిధుల వాదనను ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి నుంచి ఎటువంటి ప్రతిస్పందన రానందున అదే డీపీఆర్‌ను పైకి పంపాల్సి వస్తోందని చెబుతున్నారు.

రూ.2,600 కోట్లు ఉండగా, వెనకడుగెందుకు?

విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 విస్తరణకు సంబంధించి రూ.2,600 కోట్లను కేటాయిస్తున్నట్టు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఢిల్లీ నుంచి అమరావతికి వచ్చిన సందర్భంలో ఆయన ఈ మేరకు వెల్లడించారు. దీని ప్రకారం విజయవాడలోనూ ఎన్‌హెచ్-65ను 6 వరసలుగా విస్తరించే అవకాశం, నిధులు పుష్కలంగానే ఉన్నాయి.

ప్రజాప్రతినిధులు ఏమంటున్నారంటే..

బెంజిసర్కిల్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు ప్రతిపాదిస్తున్నారు. డీపీఆర్‌పై నిర్వహించిన సమీక్షలో ముక్తకంఠంతో ఈ డిమాండ్ చేశారు. మెట్రోరైల్ కూడా వెళ్తుండటంతో ఏపీఎంఆర్‌సీ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బెంజిసర్కిల్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు సెంట్రల్ మీడియంలో మెట్రో కారిడార్ వెళ్తుంది. కాబట్టి డబుల్ డెక్కర్ విధానంలోనే నిర్మించాలని వారు ప్రతిపాదించారు. ఇవన్నీ కాకపోతే ఆరు వరసలుగా అయినా రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

ఎట్టకేలకు బయటకు..!

(7వ పేజీ తరువాయి)

మిన్నకుండిపోయారు. 18 నెలలుగా కొడాలి నాని బయటకు రాకపోవడంతో ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆయన్ను తన నివాసానికి పిలిపించుకున్నారు. ప్రజల్లోకి రావాలని, లేకుంటే గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ తరఫున ప్రత్యామ్నాయం చూసుకుంటానని చెప్పినట్లుగా వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయన బుధవారం బయటకు వచ్చినట్లుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 6 నెలల తరువాత ప్రజల్లోకి వస్తానని నాని చెప్పడం గమనార్హం. కూటమి ప్రభుత్వం కొడాలి నానీపై ఉన్న కేసులను వెలికితీసి ఆయన్ను జైలుకు పంపిస్తుందనే వాదన కూడా వినిపిస్తోంది.

కొడాలిని అరెస్టు చేయాలని కార్యకర్తల డిమాండ్

రాజకీయ భిక్ష పెట్టిన తెలుగుదేశం పార్టీకి వెన్నుపోటు పొడిచి, అధినేత చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కొడాలి నానీపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తరువాత కనీసం నాయకులకు అందుబాటులో ఉండకుండా ఆయన తప్పించుకు తిరిగారు. ఇటీవల ముంబైలో గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని 6 నెలలుగా విశ్రాంతిలో ఉన్నారు. దాదాపు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. విశాఖపట్నంలో న్యాయవాది వేసిన కేసు, గుడివాడలో దుగ్గిరాల ప్రభాకర్‌కు చెందిన అక్రమ లిక్కర్ గోడౌన్ తరలింపు కేసు, వలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించిన కేసుల్లో న్యాయస్థానం నుంచి ఆయన కండీషన్ బెయిల్ పొందారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కొడాలి నానీపై అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటామని, మరోసారి ఎవరిపైనా అలాంటి వ్యాఖ్యలు చేయకుండా గుడివాడ వీధుల్లో కట్ డ్రాయర్‌పై ఊరేగిస్తానని లోకేశ్ గుడివాడ సభలో ప్రకటించారు. ఆ మాటను నిలబెట్టుకోవాలని కూటమి నేతలు, కార్యకర్తలు కోరుతున్నారు. కనీసం నాని చేసిన అక్రమాలు, కబ్జాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, గుడివాడలో నాని కనిపించగానే రక్తం మరిగిపోతోందని నేతలు, కార్యకర్తలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ఆరోగ్యం బాగోలేదని మాయమాటలు

తనకు ఆరోగ్యం బాగోలేదని, ఎక్కువ మంది వచ్చి కలిస్తే ఇన్‌ఫెక్షన్ సోకుతుందని ఇన్నాళ్లూ నాయకులు, కార్యకర్తలను దగ్గరకు కూడా రానివ్వలేదు. కానీ, హైదరాబాద్‌లో పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలకు తిరిగిన ఆయనకు ఇన్‌ఫెక్షన్ సోకదా.. అని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. గుడివాడకు ఆయన చేసిందేమి లేదని, కనీసం మంచినీరు కూడా సరఫరా చేయలేకపోయారని, రహదారులన్నీ గుంతలతో దారుణంగా ఉండేవని, అందుకే మొహం చాటేస్తున్నాడని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	139, 148, 159
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ నెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని బాపుల పాడు పీహెచ్‌సీ వైద్యాధికారి కె. శ్రీనివాస్ కోరారు. బుధవారం బాపులపాడు మండల కార్యాలయంలో పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియో కార్యక్రమ కార్యచరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో 4,097 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందని నిర్దేశించిన రూట్‌లు ప్రకారం వైద్య సిబ్బంది. ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయం చేసు కొని నూరుశాతం పూర్తి చేసే విధంగా కృషిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

ఉయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం గృహాలు, వాణిజ్య సముదాయాలపై విస్తృత తనిఖీలు నిర్వహించి, రూ. 9,44,000 జరిమానా విధించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీహెచ్ వాసు, ఉయ్యూరు ఈఈ బీవీ సుధాకర్ ఆధ్వర్యంలో అధికారులు 32 బృందాలుగా ఏర్పడి 2,615 నివాస గృహాలు, 108 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేసి అదనపులోడు వాడుతున్న 334 సర్వీసులకు రూ. 9,44,000 జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఉయ్యూరు డీఈఈ హేమ కుమార్, రూరల్ ఏఈ కె.నాగేశ్వరరావు, డివిజన్ పరిధిలో డీఈఈలు, ఏఈలు, ఎల్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తోపుడుబండి వితరణ

పెనమలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి నిమిత్తం నిరుపేదకు తోపుడు బండి అందజేసి మరోసారి టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ తన ఉదారతను చాటుకొన్నారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెదపులిపాక గ్రామానికి చెందిన నిరుపేద జి. లక్ష్మికి తోపుడు బండిని అందజేసి వారి కుటుంబాన్ని ఆదుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్, కొమ్మినేని వెంకటేష్, మద్దూరు వాసు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాది బాచినకు అభినందన

పెనమలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో భారత ప్రభుత్వం తరఫున వ్యాజ్యాలు వాదించేందుకు హైకోర్టు న్యాయవాది బాచిన హనుమంతరావును కేంద్ర ప్రభుత్వం నియమించడం అభినందనీయమని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం ఆయన పోరంకి వచ్చిన సందర్భంగా కూటమి నేతలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. మూడేళ్లపాటు హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరఫున ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. గతంలో బాచిన హనుమంతరావు హైకోర్టు న్యాయవాద సంఘానికి కార్యదర్శిగా, పలు జాతీయ బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

పెనమలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యనమలకుదురు ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శొంటి శివరాంప్రసాద్ మాట్లాడుతూ, దాతల సాయంతో విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అందజేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కే శిరీష, దాతలు కే మల్లేశ్వరరావు, డీ శ్రీనివాస్, టీడీపీ నేతలు చిర్రావూరి శేషు, ఎడ్లపల్లి సురేష్, సత్య, ఏడుకొండలు, బలగం కొండ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు గ్రామంలోని 15వ వార్డులో రూ. 5.7 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్‌కు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లింగాల భాస్కరరావు, చిగురుపాటి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇమాం మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన ర్యాలీ

సుప్రీం తీర్పుపై పిటీషన్లు వేయాలి: యూటీఎఫ్

ఉయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు రెండు సంవత్సరాలలోపు టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష ఉత్తీర్ణులవ్వాలని లేకపోతే సర్వీస్ నుంచి తొలగిస్తామని సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిటీషన్లు వేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉయ్యూరులో నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం డివిజన్ బాధ్యులు, జిల్లా కార్యదర్శి పీవీ రమణ, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్‌కుమార్ కోరారు. కె.శ్రీనివాసరావు, కేపి విశ్వమోహన్, నరేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నుంచి కింద పడిన వ్యక్తి మృతి

పెనమలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా ఫుట్‌బోర్డు నుంచి కింద పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వణుకూరుకు చెందిన ఉప్పులూరి కోటేశ్వరరావు(70) మంగళవారం కిరాణా సామాన్లు తీసుకురావడానికి పటమట వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సు ఎక్కి వస్తుండగా కింద పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా అక్కడ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్

విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే నైతిక విలువలు, సోదరభావం, ఐకమత్యం, సామాజిక సహకారంపై అవగాహన కలిగి ఉండాలని విమానాశ్రయ అధికారి రామా రావు అన్నారు. స్థానిక విఎస్ సెయింట్ జాన్స్ పాఠశాలలో భారత విమానయాన సంస్థ సత్యనిష్ఠ సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, విద్యార్థులకు బాల్యంలో ఏది నేర్పితే అది భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్రప్ర దేశ్‌లో తొలి సత్యనిష్ఠ సంఘాన్ని ఈ పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యా ర్థులు దీనిలో ఉంటారని చెప్పారు. సంఘం లక్ష్యాన్ని తెలిపే ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ సంతోష్‌కుమార్, పాఠశాల సత్యనిష్ఠ సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి రోటరీ క్లబ్ ఆర్థిక సాయం

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల అభ్యున్నతికి రోటరీ క్లబ్ ముందుంటుందని సీనియర్ రోటరీయన్ నర్రా సీతారామారావు అన్నారు. మండలంలోని కేసరపల్లి వీకేఆర్ కళాశా లలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థిని జాహ్నవికి బుధవారం రూ.12వేలు ఆర్థిక సహాయాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు గొట్టం వెంకట రవిబాబు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భగా సీతారామారావు మాట్లాడుతూ, దాతలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చదువులో మరింతగా రాణించాలన్నారు. రోటరీయన్ గన్నె వెంకట్రావు మాట్లాడుతూ, నలుగురికి సహాయం చేసే స్థితికి ఎదగాలన్నారు. సమాజ అభివృద్ధిలో రోటరీ క్లబ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, రోటరీయన్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలే లక్ష్యం

సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ



సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సత్వర, సులభతరమైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బొమ్ములూరులో రూ43.60 లక్షల ఎన్నార్జీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.18 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, రూ. 25 లక్షలతో నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, గతంలో సచివాలయ వ్యవస్థ రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకుంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత క్రమబద్ధీకరించడం ద్వారా ప్రజల వద్దకే మెరుగైన సేవలందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, స్థలదాత ముసు నూరు కాశీవిశ్వేశ్వరరావు, జనసేన నియోజకర వర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, కొల్లి చందు, మూల్పూరి సాయి కళ్యాణి, చిరుమామిళ్ల సూర్యం, గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, వేములపల్లి శ్రీనివాసరావు, చింతల వెంకటశివ అప్పారావు, గండేపూడి నితీష్, మండాది రవీంద్ర తదితరులతో పాటు తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో జోగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్వోబీల నిర్మాణంతో గ్రామాల్లో అభివృద్ధి

ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం



పురుషోత్తపట్నం రైల్వే గేటు వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్వోబీల నిర్మాణంతో గ్రామాలు సత్వరం అభివృద్ధి చెందుతాయని గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. వీరవల్లి-రేమల్లె రహదారిలో ఒద్దుల గేటు వద్ద ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణ స్థలాన్ని బుధవారం తహసీల్దార్ మురళీ కృష్ణతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి)ల నిర్వహణలోపాల వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్న నేపథ్యంలో ప్రతి చోట ఆర్వోబీలే నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయం మేరకు స్థల పరిశీలన చేయడం జరిగిందని వివరించారు. ఆర్వోబీ నిర్మాణం వల్ల వేలేరు, రేమల్లె, వీరవల్లి, రంగన్నగూడెం గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుండపనేని ఉమావరప్ర సాద్, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కలపాల నాని, వేము లపల్లి శ్రీనివాసరావు, మండాది రవీంద్ర, వీ ఆర్వో సునీల్ కుమార్, సర్వేయర్ ఫణికుమార్, రైతులు పాల్గొన్నారు.

గన్నవరం : గన్నవరం-పురుషోత్తపట్నం రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ మంజూరైంది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ శాఖల అధికారులు స్థల పరిశీలన చేశారు. గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, రైల్వే ఇంజనీర్ సుందర్ ప్రసాద్, తహసీల్దార్ కేవీ శివయ్య, ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ ఏఈలు శ్రీహరి, దాసు, వెంకట రాజు, మండల సర్వేయర్ మాధవరావులతో కలసి ఆర్వోబీ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. చిన అవుటపల్లి వద్ద కూడా మరో ఆర్వోబి కూడా మంజూరైనట్లు తెలిపారు.

ఫలించిన కూటమి నాయకుల కృషి

గన్నవరం : రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబి కోసం పురుషోత్తపట్నం వాసులు తీవ్ర కృషి చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు, పలుమార్లు రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. రైల్ ఓవర్ బ్రిడ్జి లేకపోవటం వల్ల పురుషోత్తపట్నంతో పాటు కొండపావులూరు, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం, ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం, చనుపల్లివారిగూడెం, రామచంద్రాపురం ప్రజలు గన్నవరం రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడేవారు. రైల్‌గేటు పడితే 2నుంచి 4 రైళ్లు వెళ్లే వరకూ నిరీక్షించాల్సి వచ్చేది. దీంతో బీజేపీ సీనియర్ నాయకుడు నాదెండ్ల మోహన్, టీడీపీ నాయకుడు మాదల సాంబశివరావు ఆధ్వర్యంలో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దృష్టికి తీసుకువెళ్ళి సమస్యను వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన సంబంధిత శాఖ కేంద్ర మంత్రి, అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఆర్వోబీని రైల్వే శాఖ మంజూరు చేసింది.



ఎన్‌పీపేటలో డిజిటల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు.. కొత్తపల్లి, మల్లవల్లి ఆయిల్‌పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ జోసఫ్ సుందరం

డిజిటల్ సేవలపై అవగాహన

ఉంగుటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియా సేవలు, లావాదేవీలపై ప్రతి ఒక్కరికీ అవగాహనతో కూడిన అప్రమత్తత చాలా అవసరమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరి బాబు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నారయ్యఅప్పారావుపేటలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవరోజు (బుధవారం) డిజిటల్ ఇండియా అవగాహ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రైతులు పంట సస్యరక్షణ చర్యలు, మార్కెట్ ధరలు, వాతావరణ వివరాలు లాంటి డిజిటల్ సేవలను అందుబాటులో ఉండేలా ఫార్మర్ ఛాట్ ద్వారా ప్రభుత్వం అందిస్తోందని మండల ఉద్యానవనశాఖ అధికారి జోసఫ్‌సుందరం తెలిపారు. కొత్తపల్లి, మల్లవల్లి గ్రామాల్లో బుధవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సహకారంతో ఫార్మర్ ఛాట్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఉద్యానవన శాఖ ద్వారా వివిధ పథకాలకు సబ్సిడీలను అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్‌గ్రీన్ ప్రతినిధి కమలాకర్, ఆయా గ్రామాల రైతులు, వీహెచ్ఎలు పాల్గొన్నారు.

ధనేకుల ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శిక్షణ

పెనమలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్దూరులో జరుగుతున్న ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక శిబిరంలో విద్యార్థులకు కొత్త సీసీ రోడ్డు నిర్మాణం, అంచనా వ్యయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల సివిల్ ఇంజనీరింగ్ అధిపతి డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ, వివిధ రకాల రోడ్లు, వాటి విధానాలు, మట్టిరకం ఆధారంగా రోడ్డును ఎలా డిజైన్ చేయాలో వివరించారు. ట్రాఫిక్ ఆధారంగా రోడ్డు వెడల్పు, నిర్మాణ ప్రమాణాలు నిర్ణయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ టీ వెంకటేశ్వరరావు, కో-ఆర్డినేటర్లు జీ రాజు, పీటీ కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

మట్టిపాత్రల తయారీపై అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ అనుకూల జీవన విధానం గురించి విద్యార్థులకు తెలియ జెప్పేందుకు మట్టిపాత్రల తయారీ కార్యక్రమం నిర్వహించినట్లు సీనియర్ ఉపాధ్యాయుడు బొడ్డపాటి ఆదినారాయణ తెలిపారు. వేలేరు, జవహర్ నవోదయలో బుధవారం బ్యాగ్‌లెస్ డే సందర్భంగా మట్టితో పాత్రల తయారీపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానంలో వివిధ చేతివృత్తుల కళాకారులు పోషించే భూమికపై విద్యార్థులకు అవగాహన కోసం పల్లెర్లమూడికి చెందిన శాలివాహన కార్మికుడు వరప్రసాద్‌తో విద్యార్థులకు మట్టిపాత్రల తయారీ గురించి తెలియజేసారు. విద్యార్థులతో మట్టి పాత్రలను తయారు చేయించారు.

పెన్షనర్లు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షనర్లు వార్షిక ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత గడువులోపు మాత్రమే సమర్పించాలని గన్నవరం ఉప ఖజానా అధికారి టి.నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు పెన్షనర్స్ వార్షిక ధ్రువీకరణ పత్రాలు 2026 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 తేదీలోపు కార్యాలయంలో అందజేయాలని నాగరాజు కోరారు.



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సుగుణావతి

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

విద్యార్థులకు డాక్టర్ సుగుణావతి సూచన

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని గుడివాడ ఏరియా హాస్పిటల్ డర్మటాలజీ డాక్టర్ సీహెచ్ సుగుణావతి అన్నారు. మండలంలోని దావాజీ గూడెం బీసీ, ఎస్సీ వసతి గృహాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకస్మికంగా తనిఖీ చేయగా విద్యార్థులు దురదలు, దద్దుర్లు వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన మందులు ఇవ్వాలని ఆదేశించారు. మందులు అందుబాటులో లేకపోతే తాను కొనుగోలు చేసి అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎంపీడీవో టి.స్వర్ణలత పర్యవేక్షణలో బుధవారం వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్లు ఇందిరాదేవి, షెహ్నాజ్, కరిముల్లా, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, హెచ్‌డబ్ల్యువోలు లక్ష్మీ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎన్జీవో ఉయ్యూరు కార్యవర్గం

ఉయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో ఉయ్యూరు తాలుకా యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రక్రియలో బి. వెంకటేశ్వరరావు ప్యానల్ మాత్రమే నామినేషన్ వేయగా నిర్ణీత సమయంలోపు మరే నామినేషన్ రాకపోవడంతో వెంకటేశ్వరరావు ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి కె.పాపారావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రాజేంద్ర ప్రకటించారు. అధ్యక్షుడిగా బి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడుగా వై.శ్రీకృష్ణ, ఉపాధ్యక్షు లుగా బీవీవీఆర్ నాగేంద్రం, వి.రామానందు, కె.శ్రీనివాసరావు, సెక్రటరీ గా ఎం.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్ శ్రీనివాసరావు, కె.బుజ్జిబాబు, కె.కృష్ణమోహన్‌రావు, మహిళా జాయింట్ సెక్రటరీగా వీవీ హిమజ, ట్రెజరర్‌గా కేబీవీఎస్ మల్లేశ్వరస్వామి ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఏ.శ్రీనివాస్, కార్యదర్శి ఏ.వెంకటేశ్వరరావు, విజయవాడ సిటీ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కూటమి పాలనలో అర్హులందరికీ ఇళ్లు

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పాలనలో అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బుధవారం టీడీపీ పోరంకి కార్యాలయంలో 432 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడ్డ ఇళ్ల లబ్ధిదారులకు పూర్తి సబ్సిడీతో రెండున్నర లక్షల చొప్పున పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లబ్ధిదారుల వివరాలు త్వరలో సాంకేతికంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల వెబ్‌సైటులో నమోదు అవుతాయని తెలిపారు. ఒక వేళ లబ్ధిదారు ఇంటి నిర్మాణం చేపట్టని పక్షంలో రాబోయే రోజుల్లో మరోసారి ఇంటి నిర్మాణం కోసం నగదు మంజూరులో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం సాధించాలి

ఉయ్యూరు : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పట్టుదలతో కృషి చేసి విజయం సాధించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల గోల్డెన్ జూబిలీ వేడుకలు పురస్కరించుకుని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పోటీల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, యువతలో ప్రతిభ, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడం, పోటీస్ఫూర్తిని అభివృద్ధి చేసేందుకు సిద్ధార్థ అకాడమీ యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉయ్యూరు చైర్మన్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	139, 148, 159
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

గుడివాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో రజని అన్నారు. బుధవారం చిలకమూడి, దొండపాడు, సైదేపూడి తదితర ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఇంటింటికి తిరిగి హాజరు శాతం పెంచటానికి కృషి చేస్తే విద్యాశాఖ సైతం సపోర్టుగా నిలబడతారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారని, వాటిని నివారించాలని ఆమె కోరారు. మౌలిక వసతులు గురించి వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రజని


రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రామలింగేశ్వరరావు

రూ. 2.50 కోట్లతో రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

కూచిపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కృషి ఫలితంగా రూ.2.50 కోట్ల నిధులతో కోసూరు నుంచి వయా పెదముత్తేవి మీదుగా కొండవరం వెళ్లే రహదారి నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రహదారులు నిర్మాణం చేయటంతోపాటు పలు రహదారుల మరమ్మతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవినేని రమేష్, తుమ్మల రాజా, పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టూటౌన్ సీఐ హనీష్

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

గుడివాడ : నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లు, లాడ్జిల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హోటళ్లు, లాడ్జిల యజమానులు, మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. లాడ్జిల్లో వసతులు పొందుతున్న వ్యక్తుల వివరాలు సరిగ్గా నమోదు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పౌరుల భద్రత, శాంతి భద్రత పరిరక్షణ దృష్ట్యా పోలీసు విభాగం సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై పి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ..అధోగతే

● ధ్వంసమైన వంతెన రెయిలింగ్
● భయాందోళనలో పాదచారులు
● పట్టించుకోని అధికారులు

(తోట్లవల్లూరు - ఆంధ్రజ్యోతి) : బొడ్డపాడు వద్ద పుల్లేటి కాలువపై ఉన్న కాలిబాట వంతెన అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ కాలిబాట వంతెనకు రెండు వైపులా రెయిలింగ్స్ విరిగిపోవడంతో ప్రయాణికులు రాకపోకల సమయాల్లో తీవ్ర భయాందోళనకు గురవుతున్నా రు. ఈ వంతెనపై ప్రయాణించే సమయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరే కాలువలో పడక తప్పదని గ్రామస్థులు వాపోతున్నారు. బొడ్డపాడు, చిన పులిపాక గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు ప్రొద్దుటూరు వైపుకి వెళ్లేందుకు కాలిబాట వంతెన దాటిల్సి ఉంది. రెండు గ్రామాల నుంచి నిత్యం వందలమంది ప్రజలు కాలిబాట వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. సైకిళ్లపై వెళ్లేటపుడు కాలువవైపు చూస్తే భయం వేస్తుందని, చాలా సంవత్సరాల నుంచి రెయిలింగ్స్ సమస్య ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం ఉయ్యూరు రోటరీ క్లబ్ ఈ వంతెన నిర్మించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. చాలా సంవత్సరాల కావటంతో వంతెన రెయిలింగ్స్ బలహీనపడి విరిగాయని, దీంతో కొంత భాగం పాడైన విద్యుత్ తగెలను తెచ్చి రక్షణగా కట్టారని స్థానికులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వంతెన రెయిలింగ్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి

పుల్లేటి కాలువపై కాలిబాట వంతెన ప్రమాదకరంగా ఉంది. ప్రొద్దుటూరు వైపుగా మచిలీపట్నం హైవే రోడ్డుకు వెళ్లేందుకు ఇది దగ్గరి మార్గం. అయితే వంతెన రెయిలింగ్స్ పూర్తిగా విరిగిపోవటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. ఇరిగిషన్ అధికారులు స్పందించి రెయిలింగ్స్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి.

మూడే శివశంకర్, బొడ్డపాడు సర్పంచ్


కాలిబట వంతెనకు రెండు వైపులా విరిగిపోయిన రెయిలింగ్స్



మల్లాయిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

కోతల తర్వాత వరిని కాల్చొద్దు

● ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి కోతల తర్వాత మిగిలిన వరిని తగులబెట్టవద్దని ఏవో బోలెం అనంతలక్ష్మి తెలిపారు. బుధవారం మల్లాయిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు వరిని తగులబెట్టడం వల్ల చాలా అనర్థాలు ఉన్నాయని తెలిపారు. మిత్ర పురుగులు చనిపోతాయని తెలిపారు. సాధ్యమైనంత వరకు ట్రాక్టర్లతో దుక్కులు దున్ని మరలా మినుము పంట వేసుకోవాలని తెలిపారు. మిషన్ల ద్వారా కోసిన వరిని తగలబెట్టవద్దని ఆమె రైతులకు తెలిపారు. ధాన్యాన్ని బాగా ఎండ బెట్టిన తర్వాతే మిల్లులకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కృష్ణ ప్రసాద్

గుడ్లవల్లేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ విధ్వంస పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ధన్యవాదాలు తెలిపారు. బుధవారం గుడ్లవల్లేరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. గుడ్లవల్లేరులో మైక్రోఫిల్టర్ నిర్మాణ పనులకు వెనిగండ్ల రాము శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మామిడికోళ్ల , లంకదొడ్డి గ్రామాల్లో మైక్రోఫిల్టర్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వడ్లమన్నాడులో వాటర్ వర్క్స్ శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్ల ఎన్ఆర్జీసీ నిధులతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులకు రాము, కృష్ణ ప్రసాద్‌లు ప్రారంభించారు. వేమవరంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గుడ్లవల్లేరు,గూడూరు మండలాలను కలుపుతూ రూ. 1.31కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేమవరం-నాగవరం బీటీ రోడ్డు పనులను పెడన, గుడివాడ ఎమ్మెల్యేలు కృష్ణ ప్రసాద్, రాములు ప్రాంభించారు. కార్యక్రమంలో స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకటరావు, కొడాలి రామరాజు, అడుసుమిల్లి రామ్మోహనరావు, ఏడుకొండలు, అట్లూరి శ్రీరామచంద్ర ప్రసాద్, అడపా బాబి, రమేష్, శివ రాజేష్, అట్లూరి స్వరూప్, నరసింహారావు పాల్గొన్నారు.


మైక్రోవాటర్ ఫిల్టర్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెనిగండ్ల

అంతరిక్ష సాంకేతికతలో యువతను ప్రోత్సహించాలి

● డాక్టర్ వి.శేషగిరిరావు

గుడ్లవల్లేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతరిక్ష సాంకేతికతలో యువతను ప్రోత్సహించడం ద్వారా భారత్ గ్లోబల్ లీడర్‌గా నిలుస్తుందని ప్రఖ్యాత పూర్వ శాస్త్రవేత్త షార్ అసోసియేట్ డైరెక్టర్, ఏపీ స్పేస్ టెక్ అకాడమీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.శేషగిరిరావు అన్నారు. బుధవారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్స్ స్పేస్ సైన్స్ అండ్ సొసైటీ అను అంశంపై అమరావతి ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ, శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అకాడమీ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ సహభాగస్వామ్యంతో సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు గౌరవ అతిథిగా విచ్చేసిన శేషగిరిరావు ఎక్స్ప్లోరింగ్ న్యూస్పేస్ ఇన్ స్పేస్ టెక్ ప్రోసెసింగ్ ఇండియన్ అండ్ గ్లోబల్ సినారియో అంశంపై మాట్లాడారు. న్యూస్పేస్ టెక్ స్టార్టప్ రంగాల వైపు యువతను ప్రోత్సహించి తద్వారా భారత సామర్థ్యాలను గ్లోబెట్ వేదికపై ప్రదర్శించడం ఈ సెమినార్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం అతిథులను కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఇస్రో పూర్వ డిప్యూటీ డైరెక్టర్, ఏపీఎస్ఏ కార్యనిర్వాహణ కార్యదర్శి డాక్టర్ కె.వి.రమణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఆర్‌సీహెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, పీజీసీ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్, అకాడమిక్స్ స్ట్రెంగ్థనింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కామరాజు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ డి.ఎన్.వి. ఎస్.ఎల్.ఎస్.ఇందిర, డాక్టర్ సి.హెచ్.కవిత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరిరావు

సమాజంలో స్త్రీ,పురుషులిద్దరూ సమానమే

● డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్

పామర్రు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ,పురుషులిద్దరూ సమానమేనని, దీనిపై గ్రామాల్లో అందరికీ అర్థమయ్యేలా విస్తృత ప్రచారం చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ అన్నారు. జెండర్ సమానత్వం కోసం జాతీయ ప్రచారంలో భాగంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం వెలుగు కార్యాలయం ఏరియాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్త్రీపురుషుల సమానత్వంపై జాతీయ స్థాయిలో ప్రభుత్వం ఒక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సమాజంలో స్త్రీపురుషులు ఇద్దరూ సమానమేనన్న భావన కల్పించడానికి జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలియజేసేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వివక్షత ఉన్నచోట ప్రాంతాల్లో స్థానిక అధికారులు అవగాహన కల్పించి వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న మహిళలు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ,స్త్రీపురుషులు సమానమేనని సమాజానికి సందేశం అందించాలని కోరారు. జిల్లా సమైక్య ప్రెసిడెంట్ బంగా రమ్య, డీపీఎంలు. సత్యభామ, విజేత పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న హరిహరనాద్, తదితరులు

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

● రేపాని కొండ

గుడివాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) :విశాఖపట్నంలో ఈనెల 31వ తేదీ నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికసంఘం పట్టణ కార్యదర్శి రేపాని కొండ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక నీలామహల్ సెంటర్‌లో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని నేటివరకు కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు మూడెడ్ల నారాయణరావు, వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు బండి శ్రీను, బండారి బాలాజీ, బత్తుల వీరయ్య, శంకర్, పెద్దిరాజులు తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రేపాని కొండ


అభిషేకానికి సిద్ధం చేసిన సహస్ర కలశాలు

వేంకటేశ్వరస్వామికి సహస్ర కలశాభిషేకం

గుడ్లవల్లేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులో వేంచేసిన భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త సుధారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల అనంతరం నిర్వహించే సహస్ర కలశాభిషేకం, రథోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గర్భాలయం నుంచి వెండి భోగ శ్రీనివాసమూర్తిని, విఖనసాచార్యులను ఆలయ ముఖమండపంలోకి ధారా బంధనంతో ఆహ్వానించారు. వేయి నామాలవారికి వేయికలశాలతో అభిషేకం,శాంతి హోమం, పూర్ణాహుతి, తిరుమాడ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామికి పూజలు చేశామని అర్చకులు తెలిపారు.

వంతెనకు తాత్కాలిక మరమ్మతులు

పెద పారుపూడి : రూ. 5లక్షల నిధులతో దోసపాడు వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. దోసపాడు ఛానల్‌పై కూలిన వంతెన మరమ్మతు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. త్వరలోనే పూర్తిస్థాయి వంతెన ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి రాంబాబు మాజీ సర్పంచులు శివకుమార్, నాగదేసి సునీత, తహసీల్దార్ శీనునాయక్, ఆర్.ఐ శ్రీనివాస్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి పెరుగు వితరణ

పమిడిముక్కల: పుట్టిన రోజును విభిన్నంగా జరుపుకుని తోటివిద్యార్థులకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని పిడుగు అర్చన పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి పెరుగు, మజ్జిగ అందజేసింది. పుట్టిన రోజును తోటివారికి ఉపయోగపడేలా జరుపుకోవాలని ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు సూచన మేర అర్చన విద్యార్థులందరికీ సరిపడేలా పెరుగు, మజ్జిగ అందజేయడం పట్ల ఉపాధ్యాయులు అభినందించారు.

సీఆర్‌రెడ్డి జయంతి

గుడివాడ రూరల్: స్థానిక చౌటపల్లి గ్రంథాలయంలో బుధవారం ప్రముఖ రచయిత, వాగ్గేయకారుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జి.రత్న బోస్, గ్రామ ప్రముఖుడు అట్లూరి నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డు వరం

● ఎంపీడీవో కాండ్రు జ్యోతి

పామర్రు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల గౌరవంకోసం ప్రభుత్వం 60ఏళ్లు దాటిన వారికి అందిస్తున్న సీనియర్ సిటిజన్ కార్డు వృద్ధులకు ఓ వరమని, దీనివల్ల ఎన్నో ప్రయోజాలున్నాయని పామర్రు ఎంపీడీవో కాండ్రు జ్యోతి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ కార్డు ఉంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు, రాయితీలన్నీ సులభంగా పొందవచ్చునన్నారు. అంతేకాక ఆర్టీసీ బస్సు చార్జీల్లో 25శాతం రాయితీ లభిస్తుందన్నారు. రైల్లో కిందబెర్తులు కేటాయింపు, బ్యాంకింగ్, పోస్టాఫీసుల్లో డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ పొందడానికి ఈ కార్డు ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. పాస్‌పోర్టు రుసుంలో పదిశాతం రాయితీతోపాటుగా ప్రత్యేకంగా టోకెన్లు జారీచేసి, పనిత్వరగా పూర్తి చేస్తారన్నారు. సంబంధిత కార్డులపై వ్యక్తిగత బ్లడ్ గ్రూప్, డఅత్యవసర సందర్భాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు సైతం పొందుపర్చనున్నామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని సంబంధిత అధికార సిబ్బంది కృషి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌ఇజీఎస్ ఏపీవో సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి ప్రతిభ

గుడివాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వతేదీన గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్స్ పాఠశాల విద్యార్థి యమ్.హర్షిత్ చౌదరి 14 సంవత్సరాలలోపు బాలుర వ్యక్తిగత కుమితె విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పతకం సాధించిన విద్యార్థి, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావులను ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


పతక గ్రహీత చౌదరిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్

రూ. 20లక్షలతో ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు

పమిడిముక్కల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంటాడ- ఉయ్యూరు ఆర్అండ్‌బీ రోడ్డు రూ. 20లక్షలతో మరమ్మతుపనులు త్వరలో చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బుధవారం తెలిపారు. మంటాడ శివాలయం నుంచి ఉయ్యూరు బస్‌స్టాండ్ వరకు పొడవునా గుంతలమయంగా తయరై వాహనాలు నడిపేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బస్‌స్టాండ్ నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధి కాగా రూ. 20లక్షల మున్సిపల్ నిధులతో రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఫైర్‌స్టేషన్ నుంచి మంటాడ శివాలయం వరకు మంటాడ గ్రామపంచాయతీ పరిధిలో ఉంది. ఈ పరిస్థితుల్లో మిగిలిన రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరవలేదన్నారు. ఈ రహదారి మరమ్మతులకు నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించిన మేర వీలైనంత త్వరగా పనులు ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

కృష్ణానదీపాయలో యువకుడి మృతదేహం లభ్యం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు కృష్ణానదీపాయలో గొంగటి ప్రభు సీతారాం(25) మృతదేహం బుధవారం గుర్తు పట్టలేని రీతిలో లభ్యమయింది. గ్రామానికి చెందిన ప్రభు సీతారాం బీటెక్ పూర్తి చేసి కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీన ఇంటినుంచి వెళ్లిపోయాడు. దీంతో తండ్రి శ్రీనివాసరావు కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తోట్లవల్లూరు కృష్ణానదీపాయలో బుధవారం మత్స్యకారుడు పడవపై చేపల వేట సాగిస్తుండగా మృతదేహం కనిపించింది. మత్స్యకారులు ఇచ్చిన సమాచారంతో కుటుంబసభ్యులు, పోలీసులు వచ్చి ప్రభు సీతారాంగా గుర్తించారు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి , దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు.

70కేజీల కాపర్ వైరు చోరీ

గుడివాడ: జీవీ మాల్ వద్ద కాలువ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో భూమిలో ఉన్న 70కేజీల కాపర్ వైరును బయటకు తీశారు. మంగళవారం రాత్రి కాపర్ వైరు చుట్ట ఉంది. బుధవారం ఉదయం చేసేసరికి కనిపించలేదు. దీంతో చోరీ గురైందని బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ బాలసుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరసింహారావు తెలిపారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు


గుడివాడ : అధిక కట్నం తీసుకురావాలంటూ భర్త తనను వేధిస్తున్నాడని భార్య వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. స్థానిక బేతవోలుకు చెందిన ప్రత్యూషకు బాపట్లకు చెందిన పుట్ల సందీప్‌కు 2021లో వివాహమైంది. వీరి వైవాహిక జీవితంలో పాప కలిగింది. తాగి వచ్చి అధిక కట్నం తీసుకురావాలంటూ రోజూ హింసిస్తున్నట్లు భార్య ప్రత్యూష ఇచ్చిన ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరసింహారావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	139, 148, 159
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

వైభవంగా పైడమ్మ సంబరాలు


శిడిబొమ్మల ఊరేగింపు

పెడన, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైభవోపేతంగా జరుగుతున్న పెడన పైడమ్మ తల్లి సంబరాలు బుధవారం 7వ రోజుకు చేరాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తజన సందోహంతో ఉత్సవ ప్రాంగణం కిక్కిరిసింది. సందడి వాతావరణంలో శిడిబొమ్మల ఊరేగింపులు జరిగాయి. ఆలయ ఈవో జి.వి.కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించిన రైతు సంఘ నాయకులు

రైతులకు పరిహారం చెల్లించాలి

● ధర్నా చౌక్ వద్ద సీపీఐ ధర్నా

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తుఫానుతో నష్టపోయిన రైతులు అందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద సీపీఐ నాయకులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ, ధాన్యం, అరటి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని, పంటల బీమా అమలు చేయాలని, రైతాంగానికి నష్టం కలిగించే విద్యుత్ బిల్లు, విత్తన బిల్లులను ఉపసంహరించుకోవాలన్నారు. అప్పుల ఊబిలో ఉన్న రైతాంగానికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు.

ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

మచిలీపట్నం టౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభించేందుకు 12న ఉదయం 9 నుంచి మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఉపాధి అధికారి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

సహకార మార్కెటింగ్‌కు సాయమందించండి

మచిలీపట్నం టౌన్: సహకార మార్కెటింగ్ బలోపేతం చేసేందుకు నిధులు అందించాలని వ్యవసాయ సహకార మార్కెటింగ్, డైరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడును డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ కోరారు. బుధవారం విజయవాడలో కలసి సమస్యలను వివరించారు.వైసీపీ పాలనలో సహకార మార్కెటింగ్ సొసైటీలు నిర్వీర్యమయ్యాయని, పూర్వ వైభవం తీసుకునివచ్చేందుకు ప్రణాళిక రూపొందించి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రమాదభరితంగా వెలివోలు వంతెన అప్రోచ్

● పగుళ్లిచ్చి న వంతెన శ్లాబ్
● ప్రయాణికులకు తప్పని తిప్పలు
● పట్టించుకోని అధికారులు

(చల్లపల్లి - ఆంధ్రజ్యోతి) : వెలివోలులో కేఈబీ కెనాల్‌పై నిర్మించిన వంతెనకు చేరుకునే అప్రోచ్ సరిగాలేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెలివోలు గ్రామంలోని బీటీ రహదారి నుంచీ కేఈబీ కెనాల్‌పై వంతెనకు చేరుకునేందుకు నిర్మించిన రహదారి ఏటవాలుగా ఉండటం, ఇరువైపులా రివిట్‌మెంట్ లేకపోవటంతో ప్రజలు వంతెన దిగాలన్నా, వంతెన పైకి చేరుకోవాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం వ్యవసాయ కూలీలు, పట్టుపురుగుల రైతులు, ప్రజలు కరకట్టకు చేరుకునేందుకు వంతెనమీదుగా వెళ్లాల్సి ఉంటుంది. పశువులు సైతం నిత్యం కరకట్టపైకి చేరుకుని కృష్ణానది పాయలోకి వెళ్లివస్తుంటాయి. వంతెన దిగేప్పుడు ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. రివిట్‌మెంట్ లేకపోవటంతో రహదారి మార్జిన్లు ప్రమాదకరంగా మారాయి. అదుపుతప్పి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ప్రమాదాలకు గురై ప్రజలు మరణించిన సంఘటనలు గతంలో జరిగాయి. వంతెన అప్రోచ్‌కు కొంతమేర ఇరువైపులా రివిట్‌మెంట్ నిర్మించి సిమెంటు రహదారిని నిర్మించాలనీ లేదా రివిట్‌మెంట్, బీటీ రహదారినిఎత్తుగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


వెలివోలు వంతెనకు చేరుకునే అప్రోచ్ రహదారి

సిమ్మెంటు రోడ్డు నిర్మించాలి

వెలివోలు వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వంతెన నిర్మించి 12 సంవత్సరాలైనా సిమెంటు రహదారి నిర్మాణం చేయకపోవటంతో ఇబ్బందులు తప్పటంలేదు. ప్రమాదాలను నివారించాలంటే వంతెనను చేరుకునేందుకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేసి, ఇరువైపులా రివిట్‌మెంట్ వేసి పటిష్ట పరచాలి.

బొల్లా ఫణిబాబు, బీసీ సంఘనేత, వెలివోలు

ప్రజాదర్బార్ విజయవంతం


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

నాగాయలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్ విజయవంతంగా జరుగుతోందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. వ్యక్తిగత, గ్రామ సమస్యలపై మొత్తం 22అర్జీలు వచ్చాయి. ఎంపీడీవో కె.ఎం.చంద్రశేఖర్, తహసీల్దార్ సి.హెచ్.వీరాంజనేయ ప్రసాద్, ఆర్ అండ్ బీ డీఈఈ ఎం.రమేష్, ఇరిగేషన్ శాఖ డీఈఈ గణపతి, ఏఈఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వేణుగోపాలపురం గ్రామస్థుల సన్మానం

అవనిగడ్డ: ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను కార్యాలయంలో వేణుగోపాలపురం గ్రామస్థులు సత్కరించారు. ఉల్లిపాలెం - సాలెంపాలెం వయా వేణుగోపాలపురం ప్రధాన డూదారి 7.851 కిలోమీటర్ల మేరకు నిర్మాణానికి సాస్కి నిధుల నుంచి రూ.2.48 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా ధన్యవాదయులు తెలిపారు.

మానవ హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు

● సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను పరిరక్షించేందుకు న్యాయస్థానాలు సేవలను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. మచిలీపట్నం లేడీయాంప్థిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, న్యాయసేవాధికారి సంస్థలు బుధవారం మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రామకృష్ణయ్య మాట్లాడుతూ, మానవహక్కులను పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా న్యాయస్థానాలు ఉన్నాయన్నారు. పౌరులకు ఎక్కడైనా మానవహక్కులకు భంగం కలిగితే కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. జడ్జిలు మానవహక్కుల పరిరక్షణ చైర్మన్లుగా వ్యవహరిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పిలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యార్థి దశనుంచే మానవహక్కులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు లంకిశెట్టి హరనాథ్‌బాబు, అధ్యాపకులు సుందరలక్ష్మి, విజయశ్రీ, మృదుల, రత్న, సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.వి.రామకృష్ణయ్య

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

● రైతు సంఘాల నాయకులు

కోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎన్. పద్మప్రియకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ మద్దతు ధర 1,790లకు ఇప్పటి వరకు మండలంలో ఒక్క బస్తా ధాన్యం కూడా రైతులు వద్ద కొనుగోలు చేయలేదని ఆరోపించారు. మొంథా తుఫాను దెబ్బకు భారీగా దిగుబడి తగ్గిపోయి విలవిలలాడుతున్న రైతన్న ధాన్యం ఆరబెట్టి తేమ శాతం తక్కువ ఉంటే మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని రైతు సేవా కేంద్రాల వద్దకు తీసుకెళ్తే మిల్లర్లు ఆరుదల ధాన్యాన్ని కొనుగోలు చేయటం లేదంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి రైతుల వద్ద ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, రేపల్లె యోగ ప్రకాష్, సింహాద్రి వెంకటేశ్వరరావు, బత్తిన రాజగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఆస్తి వివాదంతో హత్యాయత్నం

● ముగ్గురిపై కేసు, రిమాండ్‌కు తరలింపు

కృత్తివెన్ను, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఆస్తి విషయమై అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం హత్యాయత్నం వరకు వెళ్లింది. రామాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు తమ్ము రామాంజనేయులు, తమ్ము రామకృష్ణారాజు, తమ్ము నరసింహస్వామి తమ తల్లి పేరు మీద ఉన్న 1.70 ఎకరాల ఉమ్మడి ఆస్తికి సంబంధించి వివాదం తలెత్తింది. దాంతో రామాంజనేయులు తన కుమారులైన శివనాగరాజు, శ్రీనివాస్‌లతో కలిసి మిగిలిన ఇద్దరు తమ్ములైన రామకృష్ణారాజు, నరసింహస్వామిలపై హత్యా చేసేందుకు కత్తులు, కర్రలతో దాడి చేయగా, ఈ దాడుల్లో రామకృష్ణారాజు, నరసింహస్వామిలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అడ్డుకొని గాయపడ్డ వారిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, ముద్దాయిలైన తండ్రి, ఇద్దరు కొడుకులను అరెస్ట్ చేసి, బంటుమిల్లి కోర్టులో హాజరుపరచగా, 15 రిమాండ్ విధించినట్లు ఎస్సై పైడిబాబు తెలిపారు.


పోలీసుల అదుపులో ముద్దాయిలు

ప్రొఫెషనల్ బాడీస్ సభ్యత్వంతో ఉద్యోగావకాశాలు

● ఐఎస్‌టీఈ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బాలాజీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రొఫెషనల్ బాడీస్‌లో సభ్యత్వం ఉంటే సులభంగా ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉందని ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పి.ఎస్.ఎస్. బాలాజీ అన్నారు. బుధవారం వైజేఆర్ డీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రొఫెషనల్ బాడీస్ ఫర్ డిప్లమో అండ్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో బాలాజీ మాట్లాడారు. న్యూఢిల్లీలోని ఎంహెచ్‌ఆర్‌డీ గుర్తింపు పొందిన ప్రొఫెషనల్ బాడీస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులు సభ్యత్వం తీసుకుంటే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ నాగజ్యోతి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి నాంచారయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డా. టి.ఎస్.ఎస్. బాలాజీ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమం జరిగింది. 44 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నాలుగు లక్షల 639లు సహాయాన్ని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ అందజేశారు.


బంటుమిల్లిలో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతైన పూరిల్లు

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

బంటుమిల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు అగ్నికి ఆహుతైంది. బంటుమిల్లి ప్రభుత్వ కళాశాల సమీపంలోని దుర్గానగర్‌లో బుధవారం కోటేశ్వరరావుకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. బాధితుడు కోటేశ్వరరావు తన కుమారుడి భవానీ మాల ఇరుముడి సందర్భంగా గుడి వద్ద ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేకపోయే సరికి విలువైన సామగ్రిని కూడా కాపాడుకోలేకపోయారు.రూ.3.50 లక్షలు, 5తులాల బంగారం, వెండి, నివేశనా స్థలం పట్టా, విలువైన డాక్యుమెంట్లు కాలి బూడిద అయ్యాయి. కట్టుబట్టలతో మిగాలారు. ఫైర్ ఆఫీసర్ మోహనరావు, సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన లింగారెడ్డిపాలెం విద్యార్థులు

కోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్చరల్ అకడమిక్ క్రీడా పోటీల్లో లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి రూ.22 వేల క్యాష్ ప్రైజ్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నకుమారి తెలిపారు. ఉయ్యూరు సిద్ధార్థ కాలేజ్ 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళ, బుధవారాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లా నుంచి 1600 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఇంపాక్ట్ ఆఫ్ సోషల్ మీడియా ఆన్ స్టూడెంట్స్ అనే టాపిక్ మీద ఎస్సే రైటింగ్ పోటీల్లో 10, 9వ తరగతి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. జనరల్ నాలెడ్జ్ క్విజ్, జానపద దేశభక్తి పాటల పోటీలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారని హెచ్ఎం తెలిపారు.

టీడీపీ నాయకులపై కేసు కొట్టివేత

అవనిగడ్డ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దుర్మార్గ పరిపాలనలో 2023వ సంవత్సరంలో రేపల్లె పోలీసు వారు నాగాయలంక మండలం పెద్దపాలెం గ్రామంలో ఒక దళిత కుటుంబాన్ని అర్ధరాత్రి వచ్చి నిద్ర మంచం మీదే భార్యని కూడా తోసివేసి భర్తను రేపల్లె పోలీసు స్టేషనుకు తీసుకెళ్లిన సందర్భంలో భార్య దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా, ఆమెను హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆ కుటుంబానికి అండగా అప్పటి తెలుగుదేశం నాయకులు జరిగిన అన్యాయాన్ని నిలదీశారు. ఆ కుటుంబానికి అండగా ఉన్నారు. వీరిలో కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, దున్నా రాజేష్, కొల్లూరు ఇమ్మానియేలు, తానంకి పోతురాజు, ఇంకా 16 మందిపై అప్పటి పోలీసు వారు కేసు పెట్టారు. ఆ కేసు జడ్జి సమక్షంలో పూర్వాపరాలు విచారించి బుధవారం కొట్టివేశారు.

గ్రామీణ అభివృద్ధే కూటమి లక్ష్యం

కోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండలి వెంకట్రామ్ అన్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు బుధవారం కోడూరు ప్రధాన సెంటర్‌లో మోదీ, చంద్రబాబు, పవన్, బాలశౌరి, బుద్ధప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. వెంకట్రామ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 35 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.14.57 కోట్లు మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల మీద ఎక్కడ తట్టమట్టి కూడా పోయలేదన్నారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, మర్రె గంగయ్య, అద్దంకి పాండురంగారావు, తోట రాంబాబు, భాస్కరరావు, లంకే యుగంధర్, కోట రాంబాబు పాల్గొన్నారు.


పవన్ కల్యాణ్, చంద్రబాబు, మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

సీపీఆర్‌పై కేయూలో అవగాహన

మచిలీపట్నం టౌన్: అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స చేసే విధంగా విద్యార్థులు సిద్ధం కావాలని ఉపకులపతి ఆచార్య కె.రాంజీ అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం (సీపీఆర్)పై శిక్షణా కార్యక్రమం, వైద్యశిబిరం నిర్వహించారు. మచిలీపట్నం యూనిట్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.శివప్రసాద్, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు అంజనేయకుమార్ ప్రసంగించారు.

రగ్గుల పంపిణీ

పెడన: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ (ఏఐడబ్ల్యుఎఫ్) కృష్ణాజిల్లా శాఖ బుధవారం పెడన విఘ్నేశ్వర ప్రార్ధన మందిరంలో వంద మంది నిరుపేద మహిళలకు రగ్గులను సభ్యులు పంపిణీ చేశారు. చేసింది.

కట్టమంచిని స్ఫూర్తిగా తీసుకోవాలి

మచిలీపట్నంటౌన్: బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. కట్టమంచి రామలింగారెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, సంస్థ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బి.విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది నాంచారయ్య నాయుడుకు సత్కారం

చల్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్‌కు హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన ప్రముఖ న్యాయవాది, జనసేన లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాసు నాంచారయ్య నాయుడును జనసేన నేత అనుముకొండ పూర్ణ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఏటీఎం సెంటరులో జరిగిన కార్యక్రమంలో నాంచారయ్యను పలువురు అభినందించారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైతేపల్లి దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, న్యాయవాది ఎం.సరస్వతి, టీడీపీ నేతలు రావి రాజేశ్వరరావు, బావిశెట్టి కనకదుర్గ, జనసేన నేతలు గంగిశెట్టి బాబూరాజేంద్ర, మడమల రంజిత్‌కుమార్, వీరయ్య పాల్గొన్నారు.


నాంచారయ్య నాయుడును సన్మానిస్తున్న పూర్ణ తదితరులు

నాణ్యతతో భోజనాన్ని తయారు చేయాలి

● ఆహార కమిషన్ సభ్యుడు కృష్ణ కిరణ్

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ గురుకుల పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని సమర్థంగా నిర్వహించి విద్యార్థుల మెప్పు పొందాలని ఫుడ్ కమీషన్ సభ్యులు జె.కృష్ణ కిరణ్ అన్నారు. బుధవారం గురుకుల పాఠశాలలోని డార్మెటరీ, డైనింగ్ హాల్ పరిశీలించారు. అనంతరం 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఎంఈవో ఎస్.శివశంకరరావు, ప్రిన్సిపాల్ కనపర్తి జాన్, పీఈటీ వీరకుమార్ పాల్గొన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యంపై కమిషన్ సభ్యులు ఆగ్రహం

మోపిదేవి: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందించాల్సిన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యంపై ఫుడ్ కమిషన్ సభ్యులు జె.కృష్ణ కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మోపిదేవి, బోడగుంటలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల, రేషన్ దుకాణాలను అధికారులతో కలసి తనిఖీ చేశారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందజేతపై ఆరా తీశారు. కోడిగ్రుడ్లు, బాలామృతం, సరుకులు లేకపోవటంతో వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. రావివారిపాలెంలోడీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో డీవైఈవో శేఖర్ సింగ్, ఎంఈవో ఎ.వి.రమణ, జిఎన్.బి.గోపాల్, ఐసీడీఎస్ అధికారులు ఉన్నారు.


గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన కృష్ణ కిరణ్

